సాక్షి కర్నూలు

శనివారం | 15 | జూలై | 2023



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



వెండి పళ్లెం బహూకరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి తూర్పు గోదావరి జిల్లా నెలమూరుకు చెందిన మోహన సత్యభాస్కర మణికంఠ రూ.1,08,417 విలువ చేసే వెండి పళ్లెంను బహూకరించారు.



కరువు నేలలో 'నేరేడు' సిరులు

నేరేడు పండ్ల వ్యాపారం వందలాది కుటుంబాలకు ఉపాధిని చూపుతోంది. ఎలాంటి పెట్టుబడి లేకుండా సహజ సిద్ధంగా వచ్చే ఈ పంట రైతులకు లాభసాటిగా మారింది.

8లో▸

న్యూస్‌రీల్

21న వైఎస్సార్ నేతన్న నేస్తం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ నేతన్న నేస్తం కింద చేనేత పరిశ్రమ అభివృద్ధికి నెలకు రూ.2వేల ప్రకారం ఏడాదికి రూ.24వేల చొప్పున చేనేతల బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారు. ఈ నెల 21న వరుసగా 4వ ఏడాది కూడా వైఎస్సార్ నేతన్న నేస్తం అమలుకు రంగం సిద్ధమైంది. కర్నూలు జిల్లాలో 3,300 పైగా కుటుంబాలకు, నంద్యాల జిల్లాలో దాదాపు 900 కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. తుది జాబితాను ఒకటి, రెండు రోజుల్లో ఆయా జిల్లా జిల్లాల కలెక్టర్లు ఆమోదించనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి జిల్లా వెంకటగిరిలో బటన్‌నొక్కి వైఎస్సార్ నేతన్న నేస్తం కింద చేనేతల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

11 మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు 11 మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. తుగ్గలిలో 23.2, బేతంచెర్లలో 13.2, ఆళ్లగడ్డలో 6.4, డోన్‌లో 4.8, శ్రీశైలంలో 4.2, జూపాడుబంగ్లాలో 3.8, పాములపాడులో 3.2, ఆత్మకూరులో 2.4, వెలుగోడులో 1.4, పాణ్యంలో 1.0, కొత్తపల్లిలో 0.8 మి.మీ. ప్రకారం వర్షపాతం నమోదైంది. జూలై నెల నంద్యాల జిల్లాలో సాధారణ వర్షపాతం 141.2 మి.మీ. ఉండగా ఇప్పటి వరకు 44, కర్నూలు జిల్లాలో సాధారణ వర్షపాతం 90.7 మి.మీ. ఉండగా ఇప్పటి వరకు 25.9 మి.మీ నమోదైంది.

కృష్ణగిరి తహసీల్దార్ సస్పెన్షన్

- భూముల మ్యూటేషన్‌లో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ

కర్నూలు(సెంట్రల్): కృష్ణగిరి తహసీల్దార్‌గా పనిచేస్తున్న పురుషోత్తముడుపై సస్పెన్షన్ వేటు పడింది. కృష్ణగిరి డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయనకు అక్కడ తహసీల్దార్ లేకపోవడంతో పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో పనిచస్తున్నారు. మండలంలోని అమకతాడు, మున్నెగుంట్లలో సర్వే నంబర్లు 160, 299 లలోని 1.40 ఎకరాలను నిబంధనలకు వ్యతిరేకంగా ఆన్‌లైన్‌లో అక్రమార్కుల పేరిట ఎక్కించారు. ఈ విషయం బయటకు రావడంతో కలెక్టర్ జి.సృజన పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్‌తో విచారణ చేయించారు. విచారణలో అక్రమాలకు పాల్పడినట్లు నిజమేనని తేలడంతో సస్పెండ్ చేస్తూ శుక్రవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు ఇచ్చారు. కాగా.. కృష్ణగిరి తహశీల్దార్‌గా తాత్కాలికంగా వెల్దుర్తి తహసీల్దార్‌కు బాధ్యతలు అప్పజెప్పారు.

డ్రైవర్ కుమార్తెకు ఎడ్‌సెట్‌లో స్టేట్ ఫస్ట్‌ర్యాంక్



విద్యార్థిని అస్మా

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణానికి చెందిన అస్మా అనే విద్యార్థిని ఎడ్‌సెట్‌లో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించింది. తండ్రి మహమ్మద్ రఫీ వృత్తి రీత్యా కారు డ్రైవర్ అయినప్పటికీ కుమార్తెను ప్రోత్సహిస్తూ వచ్చారు. స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో బీఎస్సీ(బీజెడ్‌సీ) పూర్తి చేసిన అనంతరం ఎడ్‌సెట్ రాయగా బయాలజీ విభాగంలో అస్మాకు 100కు 98 మార్కులు వచ్చాయి. రాష్ట్రంలో మొదటి ర్యాంకు రావడంతో విద్యార్థిని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆదోనిలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

కర్నూలు సిటీ: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం రాత్రి ఆదోనికి చేరుకున్నారు. రాత్రి ఆయన అక్కడే బస చేసి శనివారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేయనున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ వెంట డీఈఓ రంగారెడ్డి, సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ వేణుగోపాల్, ఏడీ శ్యామ్యూల్ పాల్ ఉన్నారు.

సబ్సిడీ టమాటకు పోటెత్తారు!



కర్నూలులో సబ్సిడీ టమాట కోసం క్యూలైన్‌లో ఉన్న వినియోగదారులు

కర్నూలు(అగ్రికల్చర్): సబ్సిడీ టమాటను పొందేందుకు వినియోగదారులు పోటెత్తారు. శుక్రవారం కర్నూలు, ఆదోనిలోని రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి మార్కెటింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో సబ్సిడీపై టమాట పంపిణీ చేశారు. వినియోగదారుల తాకిడి ఎక్కువగా ఉండటంతో భారీ క్యూలైన్లు కనిపించాయి. మదనపల్లిలో కొనుగోలు చేసిన టమాట కర్నూలు చేరే సరికి కిలోకు రూ.123.13 ఖర్చు వస్తోంది. వినియోగదారులకు కిలో రూ.50కే పంపిణీ చేస్తూ ప్రభుత్వం రూ.73.13 భరిస్తోంది.



ఈ చిత్రంలోని చిన్నారి పేరు చతుర్వేద్. ప్రస్తుతం నగరంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరూ వైద్యులే. పిల్లాడి బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మ్యాథ్స్‌లో ఇంటి వద్ద ట్యూషన్ పెట్టించారు. అదేవిధంగా ఎలాంటి పరిస్థితుల్లోనైనా నెగ్గుకురావాలనే ఉద్దేశంతో ఇంట్లోనే యోగా సాధన చేయిస్తున్నారు.



ఇంటి పట్టున.. ఇష్టంగా అభ్యాసన!

హోం ట్యూషన్లకు ఆదరణ
- ప్రయివేట్ పాఠశాలల్లో కనిపించని ప్రత్యేక చొరవ
- తీరిక లేని తల్లిదండ్రులు
- పిల్లలపై ప్రభావం చూపుతున్న పోటీతత్వం
- దిద్దుబాటు చర్యలకు ఇంటి వద్దకే ప్రత్యేక ఉపాధ్యాయులు
- చదువుతో పాటు వ్యక్తిగత పర్యవేక్షణ

లక్షలు పోసి ప్రయివేట్ పాఠశాలల్లో చదివిస్తున్నా ఏదో వెలితి. మార్కులు ఎందుకు తక్కువ వస్తున్నాయి? ర్యాంకుల్లో ఎక్కడ తడబడుతున్నారు? తల్లి దండ్రుల ఆలోచన విద్యార్థులకు శాపంగా మారుతోంది. పోటీ ప్రపంచానికి దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు క్షణం తీరికలేని విధంగా పిల్లల బుర్రకు పదును పెట్టే ప్రయత్నం జరుగుతోంది. ఈ పరిస్థితి కొంత వరకు మేలు చేస్తున్నా.. ఒకానొక దశలో మానసిక రుగ్మతలకు కారణమవుతోంది. దాదాపుగా రోజంతా పుస్తకాలతోనే కుస్తీ పట్టడం.. ఇంటికి చేరుకున్నా అదే చదువులో ఇమిడిపోవడంతో కొత్త సమస్యలకు దారితీస్తోంది. జ్ఞానం ముఖ్యమే అయినా.. లోకజ్ఞానం అంతకు మించి ప్రాధాన్యం అనే విషయం మరుగున పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితుల్లో పిల్లల మానసిక పరిపక్వత మెరుగుతో పాటు వ్యక్తిగత పర్యవేక్షణకు 'ఇంటి వద్దే ట్యూషన్' ప్రత్యామ్నాయ మార్గంగా నిలుస్తోంది. – సాక్షి, కర్నూలు డెస్క్


కార్పొరేట్ విద్య పల్లెలకూ విస్తరించడం, ఒకరిని చూసి మరొకరు తమ పిల్లలకు కాన్వెంట్ చదువులు చదివించాలనుకోవడం.. వెరసి విద్యను 'కొనుక్కోవాల్సిన' పరిస్థితి అధికమైంది. అక్కడ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారా, అనువైన సౌకర్యాలు ఉన్నాయా? ఇలాంటి విషయాలను ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో కార్పొరేట్ పాఠశాలల పెత్తనం అధికమైంది. తల్లిదండ్రుల్లో ప్రశ్నించే తత్వం లేకపోవడం వల్ల కాంక్రీట్ వనాల్లో చాలా వరకు విద్యార్థులు పోటీతత్వాన్ని తట్టుకోలేక మానసికంగా కుంగిపోతున్నారు. క్లాస్ రూంల్లో ఉపాధ్యాయులు పిల్లలందరికీ ఒకేవిధమైన బోధన అందించడం, వెనుకబడిన విద్యార్థులను పట్టించుకోకపోవడం కొత్త సమస్యలకు దారితీస్తోంది. ఒకరు కష్టపడితే ఇంటిల్లిపాది కూర్చొని తింటున్నారనే మాట ఒకప్పుడు. ఇప్పుడు భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగం చేస్తే తప్ప కుటుంబం గడవటం కష్టమవుతోంది. ఈనేపథ్యంలో ఉదయం లేచినప్పటి నుంచి సాయంత్రం ఇంటికి చేరే వరకు ఇద్దరిదీ ఉరుకులు పరుగుల జీవితమే. కార్పొరేట్ పాఠశాలలో చేర్పించామని సంబరపడిపోవడం తప్పితే.. పిల్లల చదువు ఏ స్థాయిలో ఉందనే విషయం పట్టించుకునే సమయం కూడా ఉండని పరిస్థితి. ర్యాంకు కార్డులు చూసి, అప్పుడు మేల్కోవడం.. పిల్లలకు చీవాట్లు పెట్టడం సరేసరి.. కానీ అందుకు కారణాలను విశ్లేషించుకోకపోవడం గమనార్హం.

ఒకప్పుడు తల్లి పంచన..

తల్లి ఆది గురువు అంటారు. ఒకప్పుడు తండ్రి బయటి వ్యవహారాలను చక్కబెడితే.. ఇంటిని ఇల్లాలు తీర్చిదిద్దేది. అందులో భాగంగానే పిల్లలు పాఠశాల నుంచి ఇంటికి చేరుకోగానే అక్కడి పరిస్థితులు తెలుసుకోవడం, పక్కనే కూర్చొని చదివించడం జరిగేది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుండటం వల్ల ఇంటికి వచ్చేలోపు అలసిపోతూ పిల్లలను పట్టించుకునే సమయం ఉండటం లేదనేది జగమెరిగిన సత్యం. ఇక భార్య ఇంటి పట్టునే ఉంటున్నా, గంటల కొద్దీ టీవీకి అతుక్కుపోయి సీరియళ్లతో కాలక్షేపం చేస్తుండటంతో పిల్లలు కూడా సెల్‌ఫోన్లకు బానిసలవుతూ చదువును అటకెక్కిస్తున్నారు.

కార్పొరేట్ చొరబాటు

తల్లిదండ్రుల ఆసక్తిని కార్పొరేట్ సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ట్యూషన్ చెప్పిస్తే కానీ తమ పిల్లాడు చదువులో మెరుగు కాలేడనే భావన ఈ సంస్థలకు కాసులు కురిపిస్తోంది. బైజూస్, వేదాంత తదితర కార్పొరేట్ సంస్థలు ఆన్‌లైన్ క్లాసుల పేరిట వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఇటీవల ఓ కార్పొరేట్ సంస్థ ఆఫ్‌లైన్ ట్యూషన్‌ను కూడా కర్నూలులో ఏర్పాటు చేయడం గమనార్హం. డబ్బు పెట్టి విద్యను కొందామని చూస్తున్న తల్లిదండ్రులు కాస్త సమయం కేటాయించి పిల్లలకు మంచీచెడు తెలియజెబుదామని ఆలోచించకపోవడం గమనార్హం.




నలుగురిలో కలవలేక..

పాఠశాల గదిలో కొందరు పిల్లలు ఇమడలేకపోతున్నారు. 30–40 మంది పిల్లల్లో కొందరు ఉపాధ్యాయుడిని ఏదైనా సమస్య అడిగితే ఏమనుకుంటారో, మిగతా పిల్లల ముందు చులకన అవుతామేమోననే భావన అధికంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో నలుగురిలో ఒకరిగా మిగిలిపోతూ చదువులో వెనుకబడుతున్నారు. పెరిగిన వాతావరణం కూడా ప్రశ్నించే తత్వం లేకపోవడానికి కారణమవుతోంది.

సమయం సర్దుబాటు

పిల్లలను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా చదువుతో పాటు ఇతర వ్యాపకాల్లోనూ ఆరితేరాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. అయితే పాఠశాలలోనే అధిక సమయం గడపాల్సి వస్తుండటంతో మిగిలిన సమయాన్ని సర్దుబాటు చేస్తున్నారు. ఇందు కోసం అవసరమైన ట్యూషన్లు ఇంటి వద్దే ఏర్పాటు చేస్తున్నారు.



ఉపాధి కల్పిస్తున్న ట్యూషన్లు

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ వృత్తి కత్తి మీద సాముగా మారింది. వేసవి సెలవులు వస్తున్నాయంటే చాలు ప్రయివేట్ ఉపాధ్యాయులకు తల బొప్పి కడుతుంది. అడ్మిషన్లు తీసుకొస్తేనే ఉద్యోగం ఉంటుందని, లేకపోతే మీ సేవలు అక్కరలేదని యాజమాన్యాలు తెగేసి చెప్పడం వాళ్ల కొంప ముంచుతోంది. ఈ నేపథ్యంలో హోం ట్యూషన్ చెప్పుకుంటే యాజమాన్యాల ముందు చేతులు కట్టుకోవాల్సిన అవసరం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆర్థికంగా ఉన్నవాళ్లే..

ప్రయివేట్ పాఠశాలల్లో దాదాపు 10 నెలల సిలబస్‌ను ఆరు నెలల్లో పూర్తి చేస్తున్నారు. యాజమాన్యాల ఒత్తిడితో ఉపాధ్యాయులు ఈ విషయంపైనే దృష్టి సారిస్తూ విద్యార్థుల పట్ల శ్రద్ధ కనపర్చే పరిస్థితి ఉండటం లేదు. ఇక పిల్లలు కూడా ఏదైనా సందేహం నివృత్తి చేసుకుందామంటే ఎక్కడ వెనుకబడ్డామనే ముద్ర వేస్తారోనని ఆత్మన్యూనతా భావనకు లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో కాస్త ఆర్థికంగా ఉన్న వాళ్లు ఇంటి వద్దే ట్యూషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న సబ్జెక్టులు, ఆర్థిక స్తోమత ఆధారంగా రూ.3వేల నుంచి రూ.10వేల వరకు తీసుకుంటున్నారు.

హోం ట్యూషన్ ఉపయోగాలు
- హోంవర్క్‌ను పూర్తి చేయించడంలో సహాయం.
- అప్పగించిన అసైన్‌మెంట్లను సకాలంలో పూర్తి చేయడం
- మంచి అలవాట్లు, నడవడికను అలవర్చుకోవడం
- సబ్జెక్టు నాలెడ్జ్‌తో పాటు కొత్త విషయాలను నేర్చుకోవడం
- పిల్లలు ఏ విషయంలో వెనుకబడ్డారో తెలుసుకునే వెసులుబాటు
- సమయాన్ని అనుకూలంగా మలుచుకోవడం
- వ్యక్తిగత పర్యవేక్షణ కారణంగా ఆత్మస్థైర్యం పెంపు
- ఎలాంటి సందేహం వచ్చినా నివృత్తి చేసుకునే అవకాశం
- దూరం ప్రయాణించే అవసరం లేకుండా సమయాన్ని ఆదా చేసుకోవడం
- వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి

సందేహాల నివృత్తికి మార్గం



సబ్జెక్టులో వెనుకబాటుకు అనేక కారణాలు ఉంటాయి. హోం ట్యూషన్‌తో విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపర్చడం వల్ల ఎక్కడ లోపం ఉందనే విషయాన్ని తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు ఎంతో దోహదపడుతుంది. పాఠశాలలో చర్చించలేని ఎన్నో విషయాలను నివృత్తి చేసుకోవచ్చు. – టి.డి.కిశోర్‌కుమార్, మ్యాథ్స్ ఉపాధ్యాయుడు, కర్నూలు

బేసిక్స్ లేకపోవడంతోనే వెనుకబాటు



నేను ఓ ప్రయివేట్ పాఠశాలలో పని చేస్తూనే సాయంత్రం హోం ట్యూషన్ చెబుతున్నా. కరోనా కారణంగా విద్యార్థుల్లో బేసిక్స్ లోపించి వెనుకబాటు కనిపిస్తుంది. ఇంటి వద్దే ట్యూషన్ వల్ల ప్రతి రోజూ విద్యార్థిని స్వయంగా పర్యవేక్షించవచ్చు. లోపాలను తల్లిదండ్రులకు వివరించి సరిదిద్దే ప్రయత్నం జరుగుతుంది. – ఎస్.శివ, మ్యాథ్స్ ఉపాధ్యాయుడు, నంద్యాల

అవ్వకు అండగా...



ఈ చిత్రంలో ఆధార్ కార్డు, జిరాక్స్ ప్రతిని తీసుకుంటున్న వలంటీర్ పేరు పవన్. ఆదోని పట్టణం 34వ వార్డులోని విక్టోరియాపేటలో సేవలు అందిస్తున్నాడు. చౌకీమఠం సమీపంలో వృద్ధురాలు బసమ్మ, ఆమె మనవరాలు ఈరమ్మ ఉన్నారు. వృద్ధురాలికి ఎవరూ లేరు. కుమారుడు, కోడలు 16 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మనవరాలికి మతిస్థిమితం లేదు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌పై వీరు కాలం వెళ్లదీస్తున్నారు. ఈరమ్మకు దివ్యాంగుల పింఛన్ అందించేందుకు మూడు రోజులక్రితం వలంటీర్ సొంత ఖర్చులు పెట్టుకొని కడప సదరం క్యాంపునకు వెళ్లాడు. అక్కడ ఎంపిక కాకపోవడంతో మరలా దరఖాస్తు చేయించాడు. అవ్వకు ప్రతి నెలా ఇంటి వద్దనే పింఛన్ ఇస్తూ యోగక్షేమాలు తెలుసుకుంటూ సొంత మనవడిలా వ్యవహరిస్తున్న పవన్‌ను స్థానికులు అభినందిస్తున్నారు.

మనవడిలా సేవలందిస్తున్నాడు



నాకు ముందూ, వెనక ఎవరూ లేరు. ఎక్కడికి వెళ్లాలో, ఏమి చేయాలో తెలియదు. ప్రతిరోజూ కోసిగికి వెళ్లి పండ్లు అమ్ముకొని, వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తున్నా. నెలనెలా వచ్చే పింఛన్ డబ్బు మాత్రలు, తదితర ఖర్చులకు సరిపోతుంది. వలంటీర్ పవన్ మనవడిలా మనవడిలా మాకు సేవలందిస్తున్నాడు. వలంటీర్ లేకపోతే మాకు దిక్కెవరూ లేదు. – బసమ్మ, వృద్ధురాలు

రవాణా చెక్‌పోస్టులో నగదు రహిత విధానం



డీటీసీ శ్రీధర్

కర్నూలు: కర్నూలు శివారులోని పంచలింగాల రవాణా చెక్‌పోస్టులో నగదు రహిత విధానాన్ని అమలులోకి తెచ్చినట్లు రవాణా శాఖ కర్నూలు డిప్యూటీ కమిషనర్ శ్రీధర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. చెక్‌పోస్టులో చెల్లించాల్సిన బార్డర్ ట్యాక్స్, టెంపరరీ పర్మిట్ ఫీజు, వాలంటరీ ట్యాక్స్, అపరాధ రుసుం, తదితర రకాల చెల్లింపులు https://aprtacitizen.epragathi.org వెబ్‌సైట్ ద్వారా రవాణా శాఖకు పూర్తిగా నగదు రహిత విధానంలోనే చెల్లించాలని వాహనదారులకు డీటీసీ విజ్ఞప్తి చేశారు. రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రెండు రోజుల క్రితమే ఈ విధానాన్ని అమలులోకి తెచ్చామన్నారు. తాత్కాలిక అనుమతులు, స్వచ్ఛంద పన్ను రశీదుల జారీకి ఆర్‌టీఏ చెక్ పోస్టుల్లో నగదు లావాదేవీలు ఇకపై అనుమతించేది లేదన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వాహన యజమానులు, డ్రైవర్లు యాప్ ద్వారానే తాత్కాలిక అనుమతులు, స్వచ్ఛంద పన్నును పొందాలని పేర్కొన్నారు.

గడప గడపకు గ్రంథాలయ సేవలు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్

- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు కల్చరల్: గడప గడపకు గ్రంథాలయ సేవలు అందిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. శుక్రవారం గడప గడపకు గ్రంథాలయం పేరుతో జిల్లా కేంద్ర గ్రంథాలయం నుంచి జిల్లా కోర్టు, కొత్తపేట, గాలీ గేరు మీదుగా కోట్ల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష మందిని గ్రంథాలయం సభ్యులను చేర్పించే లక్ష్యంగా చైతన్య ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు మరింత అందుబాటులోకి గ్రంథాలయ సేవలను విస్తరిస్తామని వెల్లడించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు, ప్రజలందరూ రూ.వంద చెల్లించి గ్రంథాలయంలో శాశ్వత సభ్యత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆలోచనా విధానం మేరకు గ్రంథాలయాలు ప్రజలకు మరింత ఉపయోగ పడేలా అధునాతన టెక్నాలజీతో అభివృద్ధి చేస్తామన్నారు. కొత్త కోట ప్రకాష్‌రెడ్డి, న్యాయవాదులు రవిగువేర, చంద్రుడు, సుబ్బయ్య తదితరులు గ్రంథాలయ సభ్యత్వం పొందారు. మాజీ గ్రంథాలయం సంస్థ ఛైర్మన్ గంగాధర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, స్వచ్ఛంద సేవకులు మద్దిలేటి, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, లైబ్రేరియన్స్ గోవింద రెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, బషీర్, బాషా, చంద్రమ్మ, నజీమా, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



1



2



జయహో భారత్!

భారతీయుల ఆశలు, ఆకాంక్షలను మోస్తూ ఇస్రో ప్రయోగించిన బాహుబలి రాకెట్ చంద్రయాన్–3ను శుక్రవారం విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. పాఠశాల విద్యార్థులు రాకెట్ నమూనాలతో పలు చోట్ల ప్రదర్శనలు నిర్వహించారు. జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. కొన్ని చోట్ల ఎల్‌ఈడీ టీవీలు ఏర్పాటు చేసి చంద్రయాన్–3 ప్రయోగాన్ని వీక్షించారు. ఇప్పటి వరకు అమెరికా, రష్యా, చైనాలు మాత్రమే చంద్రుడి ఉపరితలంపై విజయవంతంగా తమ ఉపగ్రహాలను ల్యాండింగ్ చేశాయి. చంద్రయాన్–3 ఉపగ్రహం చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద దిగితే ఆ ఘనత సాధించిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది. అంతేకాదు చంద్రుడి ఉపరితలంపై ఉపగ్రహాన్ని ల్యాండింగ్ చేసిన నాలుగో దేశంగా రికార్డులోకి ఎక్కనుంది. – సాక్షినెట్‌వర్క్

1. ప్యాపిలి మండలం మాన్‌దొడ్డిలో విద్యార్థుల ప్రదర్శన
2. కర్నూలు టౌన్‌మోడల్ స్కూల్‌లో టీవీలో రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

నాపరాయి లారీల పట్టివేత


తనిఖీల్లో పట్టుబడిన లారీలు

కర్నూలు (న్యూసిటీ): అక్రమంగా నాపరాయిని నాలుగు లారీల్లో తరలిస్తుండడంతో గురువారం అర్ధరాత్రి బేతంచెర్లలో జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న నాపరాయి లారీలను తనిఖీ చేసి బేతంచెర్ల పోలీసుస్టేషన్‌లో అప్పగించామని డీడీ తెలిపారు. నాపరాయిని ఎక్కడ నుంచి తీసుకొస్తున్నారనే వివరాలు తెలుసుకున్న తర్వాత లారీల యాజమానులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మైనింగ్ శాఖ అనుమతి ఇచ్చిన మేరకు గనుల్లో తవ్వకాలు జరపాలని, అనుమతికి మించి తవ్వితే లైసెన్స్ రద్దు చేసి హెచ్చరించారు.

బీఎడ్ రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బీఎడ్ 2, 4వ సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను శుక్రవారం వైస్ ఛాన్సులర్ ఆచార్య ఎ.ఆనందరావు విడుదల చేశారు. బీఎడ్ 2వ సెమిస్టర్ పరీక్షలకు 611 మంది హాజర్వగా 228 మంది, 4వ సెమిస్టర్‌కు 149 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 135 మంది ఉత్తీర్ణులయ్యారని వీసీ తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం https://rayalaseemauniversity.ac.in వైబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఉపాధి నిధులతో మల్బరీ తోటల అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

కర్నూలు(అగ్రికల్చర్): మల్బరీ తోటల అభివృద్ధి, షెడ్‌ల నిర్మాణాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.27 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు ఇచ్చారని జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి విజయకుమార్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జూన్‌లో 25 ఎకరాల్లో మల్బరీ మొక్కలు నాటాలనేది లక్ష్యం కాగా.. ఇందుకు అనుగుణంగా ప్రగతి కనబరచడంపై హర్షం వ్యక్తం చేశారు. జూలైలో కూడా 25 ఎకరాల్లో మల్బరీ మొక్కలు నాటుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. సహాయ పట్టు పరిశ్రమ అధికారులు సీహెచ్ విజయకుమార్, మాసుంవలీ తదితరులు పాల్గొన్నారు.

కరువు నేలలో 'నేరేడు' సిరులు

- 400 కుటుంబాలకు పైగా ఉపాధి
- రైళ్లలోనూ అమ్మకాలు

నేరేడు.. పేరు వినగానే నోరూరుతోంది కదూ! ఈ అద్భుత ఫలాలకు కరువు నేల కోసిగి కేరాఫ్‌గా నిలిచింది. జిల్లా పశ్చిమ ప్రాంతంలోనే కాదు.. జిల్లా కేంద్రంలోనూ.. రైళ్లలోనూ కోసిగి నేరేడు దర్శనమిస్తోంది. కోసిగిలో వందలాది కుటుంబాలకు ఉపాధిని చూపుతోంది. ఎలాంటి పెట్టుబడి లేకుండా సహజ సిద్ధంగా వచ్చే దిగుబడి లాభసాటిగా ఉందని రైతులు పేర్కొంటున్నారు.


కోసిగి ఆర్టీసీ బస్టాండులో నేరేడు పండ్లు అమ్ముతున్న దృశ్యం

మంత్రాలయం: కోసిగి మండలం కరువుకు కేరాఫ్. వలసలు అత్యధికంగా ఉండే ప్రాంతం. రేగి, నేరేడు పండ్ల సాగులో ఈ ప్రాంతానికి మంచి పేరు ఉంది. ప్రస్తుతం నేరేడు సీజన్ కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు పండ్ల వ్యాపారాలకు తరలిపోతున్నారు. ఇక్కడ రైతులు పొలం గట్లపై నేరేడు చెట్లు ఎక్కువగా నాటుకున్నారు. మండలంలోని చింతకుంట, నేల కోసిగి, దుద్ది, కోసిగి ప్రాంతాల్లో ఎక్కువగా ఈ చెట్లు దర్శనమిస్తాయి. మండలంలో దాదాపు 2,000 చెట్లు ఉన్నట్లు అంచనా. రోజుకు 6,000 కేజీల పండ్ల దిగుబడి వస్తోంది. కొందరు రైతులు స్వయంగా వ్యాపారులకు విక్రయిస్తారు. ఇంకొందరు చెట్లను కౌలుకు తీసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. స్థానికంగా కేజీ నేరేడు రూ.30 నుంచి రూ.50 వరకు వ్యాపారులకు అమ్ముతున్నారు. వ్యాపారులు కేజీ రూ.100 చొప్పున ఇస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ సమీపంలో నేరేడు పండ్ల సంత జరుగుతోంది. మండల కేంద్రమైన కోసిగిలో దాదాపు 400 మంది ఇదే వ్యాపారం చేసుకుంటున్నారు. 400 కుటుంబాలకు ఉపాధిగా నేరేడు సీజన్ ఉంది.

కర్ణాటకలోనూ కోసిగి నేరేడు..

జిల్లాలోనే కాకుండా కర్ణాటక రాష్ట్రంలోనూ కోసిగి వాసులు నేరేడు పండ్లు వ్యాపారం చేస్తున్నారు. రాయచూరు, బళ్లారి, యాడికి, యాదగిరి, షాపూర్ పట్టణాలతోపాటు పల్లెటూళ్లలోనూ బండ్లపై పెట్టుకుని పండ్లు అమ్ముకుంటున్నారు. ఇంకొందరు రైళ్లలోనే గంపల్లో తీసుకెళ్లి వ్యాపారం చేసుకుంటున్నారు. మే, జూన్, జూలై నెలల్లో నేరేడు పండ్ల సీజన్ ఉంటుంది. సీజన్ ముగియగానే ఇదే ప్రాంతంలో సీతాఫలం పండ్ల సీజన్, వేసవిలో రేగి పండ్ల సీజన్ మొదలవుతుంది. ఏడాది పొడవునా పండ్ల వ్యాపారం చేస్తూనే ఉంటారు. కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో సహజ సిద్ధంగా సీజనల్ పండ్లు లభించడం ఈ ప్రాంత వాసులకు కలిసి వస్తోంది.


రైలులో పండ్లు అమ్ముకునేందుకు నేరేడు పండ్లతో కోసిగి వాసులు

పోషకాల గని నేరేడు

నేరేడు పండు ఔషధాల గని. నేరేడులో కాల్షియం, ఐరన్, పొటాషియంతోపాటు ఏ-విటమిన్, బి-విటమిన్ సమృద్ధిగా ఉంటాయి. నేరేడుతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు వరం లాంటిది. సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు నివారణకు దోహదపడుతుంది. మూత్రాశయ సమస్యలు, కిడ్నీల శుభ్రత, దంతాలు, చిగుళ్ల ఇబ్బందులు రాకుండా చేస్తాయి. జ్ఞాపకశక్తి పెరుగుదలకు, జీర్ణశక్తి పెంపునకు దోహదపడతాయి. శ్వాసకోశ, రక్తహీనత సమస్యలు తగ్గుతాయి.

కౌలుకు తీసుకున్నా



గ్రామానికి చెందిన ఓ రైతు పొలం గట్లపై ఉన్న 30 నేరేడు చెట్లు కౌలుకు తీసుకున్నా. ఒక్కో చెట్టు రూ.వెయ్యి చొప్పున రూ.30 వేలకు మాట్లాడుకున్నా. పదేళ్లుగా ఇలాగే నేరేడు చెట్లు లీజు తీసుకుని వ్యాపారం చేస్తున్నా. రోజుకు 70 కేజీల వరకు నేరేడు పండ్లు దిగుబడి వస్తోంది. వ్యాపారులకు కేజీ రూ.30–50 చొప్పున ఇస్తున్నా. సీజన్‌లో రోజుకు రూ.3 వేలకు పైగా విక్రయిస్తున్నా. మూడు నెలల్లో ఎంత లేదన్నా రూ.50 వేలకుపైగా సంపాదిస్తా.

– అల్లయ్య, కోసిగి

20 ఏళ్లుగా ఇదే వ్యాపారం



మా ప్రాంతంలో సహజ సిద్ధంగానే నేరేడు పండ్లు పండుతున్నాయి. రైతులు గట్లపై అదే పనిగా ఇక్కడ చెట్లు పెంచుతున్నారు. రోజుకు 30 కేజీల వరకు నేరేడు పండ్లు అమ్ముతున్నా. రైలులోనే పండ్లు అమ్ముకుంటున్నా. రూ.2 వేల వరకు వ్యాపారం అవుతోంది. ఖర్చులు పోనూ రోజుకు రూ. వెయ్యి వరకు మిగులుతోంది. సీజన్ ముగియగానే సీతాఫలం, రేగి పండ్ల వ్యాపారం చేస్తా. చెట్లు పెంచడంతో మాలాంటి ఎంతోమందికి ఉపాధి దొరుకుతోంది. రైతులు మరింతగా చెట్ల పెంపకంపై దృష్టి సారిస్తే బాగుంటుంది.

– మాన్వి నరసమ్మ, కోసిగి

10 చెట్లు పెంచాను



నా పొలం గట్టుపై 10 నేరేడు చెట్లు పెంచాను. సీజన్‌లో రోజుకు 30 కేజీలకుపైగా పండ్లు కాస్తున్నాయి. ఉదయమే పొలానికి వెళ్లి పండ్లను రాల్చుకుంటాం. నేనే స్వయంగా పండ్ల వ్యాపారం చేసుకుంటున్నా. కర్ణాటక ప్రాంతానికి వెళ్లి అమ్ముతున్నా. రోజుకు రూ. 3 వేల వరకు వస్తోంది. సీజన్ ముగిసేలోగా 9 క్వింటాళ్లకుపైగా పండ్లు వస్తాయి. ఏడాదికి రూ.70 వేల వరకు ఆదాయం వస్తోంది. ఎలాంటి పెట్టుబడి లేని పంట ఇది.

– నరసింహులు, కోసిగి

నకిలీ నోట్ల కేసులో ఉపాధ్యాయుడు సస్పెన్షన్


పులుసు రామకృష్ణా రెడ్డి

కోసిగి: నకిలీ నోట్ల చెలామణి కేసులో అరెస్టయిన కోసిగి మండలం దొడ్డి గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పులుసు రామకృష్ణారెడ్డిని జిల్లా విద్యాధికారి రంగారెడ్డి సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ మెయినుద్దీన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నకిలీ నోట్ల పేరుతో చీటింగ్ చేస్తున్న ముఠాతో రామకృష్ణారెడ్డి చేతులు కలిపి భారీగా డబ్బు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. రూ.లక్ష ఒరిజనల్ నోట్లకు రూ.3లక్షల దొంగనోట్లు ఇస్తామని ఓ ముఠా ఆస్పరి మండలం కారుమంచి గ్రామానికి చెందిన ఆంజనేయులు వద్ద రూ.4.80లక్షలు తీసుకుని ఉడాయించడంతో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌కు పలువురు బాధితులతో కలిసి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆ మేరకు విచారణ చేపట్టి నకిలీ నోట్ల చెలమణికి పాల్పడుతున్న ఆస్పరి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ విజయ్‌కుమార్, కోసిగికి చెందిన పులుసు గోపాల్‌కృష్ణ, దొడ్డి గ్రామ ఉపాధ్యాయుడు పులుసు రామకృష్ణా రెడ్డి, మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు దాస నరేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. ఇందులో భాగంగా కేసులో ఏ4గా ఉన్న ఉపాధ్యాయుడు రామకృష్ణ రెడ్డిని డీఈఓ సస్పెండ్ చేశారన్నారు.

ఇల్లు కడితే.. కూల్చేస్తాం!

- టీడీపీ నాయకుడి బెదిరింపు
- పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు


టీడీపీ నాయకుడు ధ్వంసం చేసిన స్థలాన్ని చూపుతున్న బాధితుడు మంగలి రాముడు


కుటుంబ సభ్యులతో వచ్చి దౌర్జన్యం చేస్తున్న టీడీపీ నాయకుడు బాలప్ప

పత్తికొండ రూరల్: రెవెన్యూ అధికారులు ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టుకుంటున్న నిరుపేదను టీడీపీ నాయకుడు అడ్డుకున్నాడు. ఇల్లు కడితే కూల్చేస్తాం అని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పత్తికొండ పోలీసు స్టేషన్‌లో టీడీపీ నాయకుడిపై కేసు నమోదైంది. పత్తికొండలోని పార్వతికొండ ప్రాంతంలోని 191/1ఎ1లోని ప్రభుత్వ స్థలంలో కొందరు పేదలకు గతంలో రెవెన్యూ అధికారులు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. మంగలి రాముడు లేఅవుట్ ప్రకారంగా 39 నంబరుతో ఇంటి పట్టా పొందాడు. నెలరోజుల కిందట ఇంటి నిర్మాణంలో భాగంగా పునాది నిర్మించుకునేందుకు పూనుకున్నాడు. టీడీపీ హయాంలో బంధువుల పేరిట స్థలాలను కబ్జా చేసిన మాజీ వార్డు మెంబర్ బాలప్ప..మంగలి రాముడు ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నాడు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబు అండదండలతో బాలప్ప అతని కుటుంబీకులు మరింత రెచ్చిపోతూ ఇంటి పునాదిని ధ్వంసం చేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని మంగలి రాముడు స్పందన కార్యక్రమంలో విన్నవించుకోగా తహసీల్దారు గత నెల 12వ తేదీన స్థలం మంగలి రాముడుదే అని ధ్రువీకరించారు. దీంతో ఇంటిని నిర్మించుకుంటున్న రాముడు కుటుంబ సభ్యులపై దౌర్జన్యం చేసి అడ్డుకోవడమే కాకుండా చంపేస్తామని బెదిరింపులకు దిగాడు. బాధితుల ఫిర్యాదు మేరకు టీడీపీ నేత బాలప్ప, అతని బంధువులు ఉప్పర గోపాల్, హరీష్, నాగరాజు, గంగాధర్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.

రజక విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు


సీపీ వెంకటేష్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధిక మార్కులు సాధించిన రజక సామాజిక వర్గానికి చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందించనున్నట్లు రజక విద్యా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సీపీ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10వ తరగతిలో 450, ఇంటర్‌లో 850 మార్కులకు పైగా, డిగ్రీలో 80 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారితో పాటు ఎంసెట్ (మెడిసిన్, ఇంజనీరింగ్)లో 10 వేల లోపు ర్యాంకులు సాధించిన వారికి జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా పురస్కారాలు ఇచ్చామన్నారు. అయితే ఈ ఏడాది నుంచి పురస్కారాలు అందించేందుకు రజక విద్యా సేవా సమితిని స్థాపించామన్నారు. ఇక నుంచి సమితి ఆధ్వర్యంలో పురస్కారాలను అందించనున్నట్లు చెప్పారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అర్హులైన విద్యార్థులు తమ వివరాలను ఇంటి నంబర్: 41/473/119, సాయిబాబా సంజీవనగర్, కర్నూలు చిరునా మాకు పంపాలన్నారు. ఇతర వివరాలకు సెల్: 9110396511, 7780506001, 9642528240 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్


పేర్లు నమోదు చేయించుకుంటున్న యువత

నందికొట్కూరు: యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు దాదాపు 580 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 15 కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరై అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయగా 225 మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నిరుద్యోగులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగ అవకాశాలు మెండుగా కల్పిస్తున్నారనానరు. 10వ తరగతి నుంచి డిగ్రీ, బీటెక్ వరకు చదువుకున్న వారందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా అధికారులను కోరామన్నారు. కంప్యూటర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో ఉపాధి చూపించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ అధికారి ప్రతాప్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. సునీత, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, సింగిల్ విండో చైర్మన్ హుసేనయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ, టౌన్ సీఐ విజయభాస్కర్, ఎస్ఐ ఎన్వీ రమణ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు డీఏవోకు మొదటి స్థానం


పి.లలితా వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ పథకాల అమలులో మే నెలకు సంబంధించి జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) పీ.లలిత వరలక్ష్మి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచారు. ఈ విషయాన్ని డాక్టర్ వైఎస్ఆర్ రైతుభరోసా మ్యాగజైన్ జూన్ సంచికలో ప్రచురించారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన జిల్లా వ్యవసాయ అధికారి పీ.లలితా వరలక్ష్మిని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్, ఉన్నతాధికారులు, జిల్లా వ్యవసాయ అధికారులు అభినందించారు. కాకినాడ జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. విజయ్‌కుమార్ రెండో స్థానంలో నిలిచారు. ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు సంబంధించి కర్నూలు జిల్లాలో గూడూరు ఆర్‌బీకే ఇన్‌చార్జ్ ఏ.సుమతి, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలం ఆర్‌బీకే ఇన్‌చార్జ్ పి.మాణిక్యరాణి జిల్లా స్థాయిల్లో మొదటి స్థానాల్లో నిలిచారు.

మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ. 35.33 లక్షలు


హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వరుడికి హుండీ కానుకల ద్వారా రూ. 35.33 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయంలోని సామూహిక అభిషేక మండపంలో శుక్రవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారితోపాటు కోదండరామాలయం, ఆంజనేయ, వినాయకనంది స్వామివారి హుండీ కానుకల ద్వారా రూ.34,59,114 వచ్చిందని, అన్నదానం విభాగం ద్వారా రూ.50,954, గోసంరక్షణ నిధి ద్వారా రూ.23,847 వచ్చినట్లు చెప్పారు. 35 రోజులకు ఈ ఆదాయం వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వివిధ ప్రాంతాలకు చెందిన సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

హలిగేర కొండపై చిరుత

ఆస్పరి: మండలంలోని హలిగేర కొండపై శుక్రవారం సాయంత్రం చిరుత పులి కనిపించింది. హలిగేర గ్రామస్తులు అరుపులు, కేకలు వేయడంతో అది పారి పోయింది. చిరుత పులి దాడిలో రెండు వానరాలు మృతి చెందాయని గ్రామస్తుడు నాయుడు తెలిపారు. గ్రామంలోకి చిరుతపులి రాకుండా రాత్రి వేళల్లో యువకులు గస్తీ తిరుగుతున్నారు. ఫారెస్టు అధికారులు స్పందించి చిరుత బంధించాలని ప్రజలు కోరుతున్నారు.

కోసిగిలో..

కోసిగి: మండల కేంద్రం కోసిగి సమీపంలోని రంగప్ప గుట్టలో శుక్రవారం సాయకాలం చిరుత కలకలం రేపింది. కొండ ప్రాంతం నుంచి దిగి పొలాల్లో ఉన్న కుక్కను వెంబడించింది. ఇది చూసి రైతులు, ప్రజలు కేకలు వేయడంతో అది కొండలోకి పరుగులు తీసింది. ఇదిలా ఉండగా గురువారం రాత్రి కోసిగి తిప్పలదొడ్డి తాయన్నకు చెందిన ఒక మేకను చిరుత పట్టుకెళ్లిందని స్థానికులు తెలిపారు.

బాలిక కిడ్నాప్‌నకు యత్నం


క్షేమంగా బయట పడిన పూజిత

ఆళ్లగడ్డ: ఎర్రగుంట్లలో శుక్రవారం బాలిక కిడ్నాప్ యత్నం ఘటన కలకలం రేపింది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ శివ కూతురు పూజిత స్థానిక ప్రైవేటు పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లిన అనంతరం రోజు మాదిరిగానే శుక్రవారం పాఠశాలకు బయలు దేరింది. ఈ క్రమంలో గ్రామంలో కొంచెం జనసంచారం తక్కువగా ఉన్న ప్రదేశంలో బైక్ నిలుపుకుని నిల్చుని ఉన్న ఇద్దరు వ్యక్తులు బాలికను అమాంతం బైకుపైకి ఎత్తుకుని ముక్కుదగ్గర కర్చీఫ్ పెట్టారు. అనంతరం పూజితను సొంత ఇంటి పైనే తాళ్లతో చేతులు, కాళ్లు కట్టి పడేశారు. మత్తు వదిలన తర్వాత మూలుగుతున్న శబ్దం విన్న అవతలి ఇంటిపై ఉన్న వారు గమనించి ఇంట్లో ఉన్న బాలిక అవ్వకు చెప్పారు. దీంతో ఆమె పైకి వెళ్లి పూజితను కిందకు తీసుకు వచ్చింది. విషయం తెలిసి గ్రామస్తులు గుంపులుగుంపులుగా వచ్చి బాలికను పరామర్శించారు. అయితే తనకు బైక్‌పై ఎక్కించుకునే వరకే గుర్తు ఉందని తరువాత ఏం జరిగిందో తెలియదని మెలకువ వచ్చేసరికి ఇంటి కప్పుపై ఉన్నానని బాలిక చెబుతోంది. ఈ విషయం పొలం దగ్గర ఉన్న తండ్రికి తెలపడంతో ఆయన ఇంటికి చేరుకుని వివరాలు తెలుసుకుని శిరివెళ్ల పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.



విశ్వాసం దారిలో!

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం నేరం. ఇక్కడ ఎద్దుల బండిపై వెళ్తున్న ముగ్గురూ సెల్‌ఫోన్ మాట్లాడుతున్నారు. నిబంధనలు మా వాహనాలకు వర్తించవనుకున్నారు కాబోలు.. కనీసం పగ్గాలను కూడా వదిలేసి, కనీసం జాతీయ రహదారిపై ఉన్నామనే ఆలోచన లేకుండా సెల్ మాయలో మునిగిపోయారు. పాపం గడ్డి పెట్టిన విశ్వాసంతో ఈ నోరులేని జీవాలు యజమానులు 'దారి'తప్పినా.. గమ్యానికి జాగ్రత్త తీసుకెళ్తున్న దృశ్యం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు